క్లుప్తంగా

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



అప్పాపురం(కాకుమాను): ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారని గ్రామ సర్పంచ్ పొందుగుల ఆచారి అన్నారు. మండలంలోని అప్పాపురం గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పొందుగుల ఆచారి మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల నుంచి అర్హతే ప్రామాణికంగా రాష్ట్రవ్యాప్తంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీటీసీ హైమావతి, ఉప సర్పంచ్ వీరయ్య చౌదరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

గుంటూరు రూరల్: పెద్దపలకలూరు రోడ్ విస్తరణలో జీఎంసీ చేపట్టాల్సిన పనులు ఏమైనా పెండింగ్ ఉంటే వాటిని వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ రోజువారీ పర్యటనలో భాగంగా పెద్దపలకలూరురోడ్డు, అడవితక్కెళ్ళపాడులోని టిడ్కోగృహాల సముదాయాలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెద్దపలకలూరురోడ్డులో సుదీర్ఘకాలం నుంచి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్ విస్తరణ పనులను జీఎంసీ నుంచి పూర్తి చేశామన్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నందున జీఎంసీ నుంచి పనులు చేయాల్సి ఉంటే, వాటిని వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఈ భాస్కర్, టిడ్కో ఎస్ఈ చిన్నకోటేశ్వరరావ పాల్గొన్నారు.

కుటుంబ ఆర్థిక స్థితిగతులపై సర్వే

వేజండ్ల(చేబ్రోలు): కేంద్ర ప్రభుత్వ జాతీయ గణాంకాల (ఎన్ఎస్ఎస్ఓ) గృహ వినియోగ ఖర్చులపై చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో మంగళవారం సర్వే నిర్వహించింది. గుంటూరు గణాంక ప్రాంతీయ కార్యాలయం జిల్లా పర్యవేక్షణ అధికారి హనుమంతరావు ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో గృహ వినియోగ ఖర్చులపై దేశవ్యాప్త వార్షిక సర్వే చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేజండ్ల గ్రామంలో సర్వేలో భాగంగా శాంపిల్ సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా ట్యాబ్ నందు సర్వే వివరాలను సిబ్బంది నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తికమాస పూజలు

- భక్తులతో కళకళలాడిన పెదకాకాని శివాలయం
- కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేసిన భక్తులు



విద్యుత్‌దీప కాంతులతో కళకళలాడుతున్న కాకాని శివాలయం



శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: పరమశివునికి అత్యంత ప్రీతికర కార్తిక మాసం మొదటిరోజు పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తులతో కళకళలాడింది. మంగళవారం వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకుని యజ్ఞాలబావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం కార్తిక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున కార్తీకదీపాల వెలుతురులో ఓం నమం శివాయ నామం స్మరించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్తికమాసం తొలిరోజు భక్తుల రాకతో సందడి నెలకొంది. సాయంత్రం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, కార్తిక ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా ఏర్పాటు చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

పెదకాకాని: ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని, వాటిని సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా చేపట్టిన అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తుందన్నారు. తొలుత శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుజ్జుల సుమతి, కామినేని శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ బీవీ మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



సంక్షేమ పథకాల పట్టికను ప్రారంభిస్తున్న తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ పద్మావతి అంజిరెడ్డి

గుంటూరు రూరల్: అభివృద్ధి కొనసాగి, సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అంది ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని వెంగళాయపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసిన నాయకుడు జగనన్న అని తెలిపారు. రాష్ట్రంలో మళ్ళీ సంక్షేమ పథకాలు ప్రజలకు అంది ప్రజలు సంతోషంగా జీవించాలంటే మరలా మనం జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి గ్రామంలోని సచివాలయం వద్ద గ్రామాభివృద్ధికి ఇప్పటి వరకూ అందించిన రూ.45 కోట్ల అభివృద్ధి కార్యక్రమాల పట్టికను ప్రారంభించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు జగనన్న ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్ పాల్గొన్నారు.

మురుగునీటి సరఫరాపై గరం గరం

ప్రత్తిపాడు: 'గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు అడుగంటుతున్నాయి. ప్రభుత్వం నీటిని సరఫరా చేసినప్పటికీ చెరువులు నింపడంలో యంత్రాంగమంతా విఫలమయ్యింది. ఇప్పటికే నీరు అడుగుకు చేరడంతో రంగు, రుచి మారిన నీటిని గ్రామాల్లోనికి సరఫరా చేస్తున్నాం. మరో పది, పదిహేను రోజుల్లో చెరువుల్లో నీరు పూర్తిగా అడుగంటితే పరిస్థితులు మరింత దారుణంగా మారుతాయి' అంటూ సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈఓపీఆర్డీ మావులూరి మోషె అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగిరెడ్డి పరమారెడ్డితో పాటు కొందరు స్థానికులు పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా చేసిన తాగునీటిని వాటర్‌బాటిల్స్‌లో నింపి సమావేశానికి తీసుకువచ్చారు. ఇలాంటి నీటిని ప్రజలు ఎలా తాగుతారంటూ ప్రశ్నించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నీటిని గ్రామంలోనికి సరఫరా చేస్తున్నామని, మరో వారం పది రోజుల్లో ఈ నీటి సరఫరాను కూడా నిలిపివేయనున్నామని చెప్పారు. మండల పరిషత్ నుంచి నిధులు కేటాయిస్తే గుంటూరు ఛానల్ నుంచి నీటిని పెట్టుకుంటామని వివరించారు. స్పందించిన ఈఓపీఆర్డీ నిధుల విషయమై ఎంపీడీఓతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంపీపీ అన్నమ్మ, తహసీల్దార్ జి.సిద్ధార్థ పాల్గొన్నారు.

అన్నవరంలో 'పల్లెకు పోదాం'

పెదనందిపాడు: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ హెప్సిబా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హెప్సిబా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయమని, అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి కృషి చేస్తున్నారని ఆమె చెప్పారు. అన్నవరం సచివాలయ పరిధిలోని అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

పెదకాకాని: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పెదకాకాని గ్రంథాలయంలో మంగళవారం ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, నెహ్రూ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. హెచ్ఎం ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

గుంటూరు రూరల్: సమాజ సేవపై మక్కువ కలిగి ఉండాలని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం అగతవరప్పాడులోని సెయింట్ ఫాస్టినాస్ బాల సదన్‌లోని అనాధలు, వృద్ధులకు నెలకు సరిపడా నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమం కళాశాలకు చెందిన టెక్ వింగ్స్ విద్యార్థులు నిర్వహించారు. సీఎస్ఈ విభాగాధిపతి ఎ.బాలాజీ పాల్గొన్నారు.

'విజయశ్రీ'లో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని విజయశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డు నందున్న ఆసుపత్రిలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గైనిక్, అబ్‌స్ట్రిక్స్, సాధారణ జబ్బులు, ఎముకలు, కీళ్ళకు సంబంధించిన వ్యాధులు, పిల్లల వ్యాధులు తదితర అత్యవసర వైద్య చికిత్సలైన హార్ట్ చెకప్, షుగర్, బీపీ టెస్టులు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ప్రజలు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

చాచా నెహ్రూ జీవితం అందరికీ ఆదర్శం



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాపతు వెంకటేశ్వరరెడ్డి



లయోలా పాఠశాలలో ఉపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలు

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రత్తిపాడు: విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుని, భవిష్యత్‌లో బాధ్యత గల పౌరులుగా ఎదగాలని ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం లైబ్రేరియన్ బి.అరుణ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపసర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వార్డుసభ్యుడు డబ్బూరి వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి వారోత్సవాలను ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గురుగూరి శ్రీనివాసరెడ్డి, కాకాని ప్రసాద్, సీహెచ్ నాగమల్లేశ్వరరావు, సీహెచ్ శ్రీహరిరావు, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

కాకుమాను: ప్రపంచ శాంతి దూత, పంచశీల ప్రదాత, భారతదేశ మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని గ్రామాలలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నెహ్రూ జయంతి వేడుకలలో జడ్పీటీసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి జోగి మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకాకానిలో..

పెదకాకాని: మహనీయుల అడుగుజాడల్లో నడుచుకోవాలని గీతాంజలి విద్యాలయం డైరెక్టర్ మునగా శ్రీహరి అన్నారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు జరుపుకొన్నారు. పెదకాకాని బాజీబాబానగర్‌లో బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ఆధ్వర్యంలో డాక్టర్ బి శాంసన్ సహకారంతో చిన్నారులకు అల్పాహారం, కేక్‌లు, ఫ్రూట్స్, పలకలు, పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పలపాడు, కొప్పురావూరు, తంగెళ్లమూడి, అనుమర్లపూడి గ్రామలలో బాలల హక్కుల వారోత్సవాలలో నిర్వహించారు. సర్పంచులు ఆలా సాంబశివరావు, సుభాషిణి, జిల్లెళ్ళ కిషోర్ బాబు బాలల హక్కులపై అవగాహన కల్పించారు.

లయోలాలో...

గుంటూరు రూరల్: ధనం కన్నా కాలం గొప్పదని విద్యార్థులు కాలాన్ని వృధా చేయకుండా విద్య పట్ల శ్రద్ధ చూపాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. మంగళవారం నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి లయోలా పూర్వ విద్యార్థులు, క్రైస్తవ మతగురువులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థుల, అధ్యాపకుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి, పాఠశాలలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ నరేష్, రెవరెండ్ ఫాదర్ ప్రసాద్ పాల్గొన్నారు.

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయస్థాయిలో హ్యాండ్ బాల్, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనపరిచిన డేవిడ్ రాజు, హరీష్ , పి అలేఖ్య, ఎస్ అలేఖ్యలకు మెమెంటో, బహుమతులను అందజేశారు. 40 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంఈఓ ప్రసాద్, హెచ్ఎం ఎం ఏడుకొండలు పాల్గొన్నారు.